## పుసులూరు, రేమడూరు గ్రామాల్లో ఎండీఓ జి.ఎన్.ఎస్. రెడ్డి పర్యటన

స్వచ్ఛత, తాగునీరు, అంగన్వాడీ, పెన్షన్లపై ప్రజలకు అవగాహన







కల్లూరు, జూలై 08, (సీమకిరణం న్యూస్): పుసులూరు, రేమడూరు గ్రామాల్లో స్వచ్ఛ రథం, స్వచ్ఛ పదం, ఎస్ఐఆర్ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించేందుకు మండల అభివృద్ధి అధికారి జి.ఎన్.ఎస్. రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో నగేష్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు, అంగన్వాడీ పాఠశాలలు, తాగునీటి సరఫరా, కాలువల నిర్వహణ, నూతన పెన్షన్లకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. అలాగే గ్రామాల్లోని రెండు జీపీఎస్‌లలో ఎన్నికల ఏర్పాట్లను కూడా పర్యవేక్షించారు. గ్రామ ప్రజలకు పలు సూచనలు చేస్తూ, వారి సమస్యలు, సందేహాలను అడిగి తెలుసుకుని సమాధానాలు ఇచ్చారు. గ్రామ పరిశుభ్రతను కాపాడుకోవాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పంచాయతీ అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి, స్వర్ణ గ్రామ సిబ్బంది, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## డోన్ లో ఘనంగా దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి వేడుకలు





డోన్ టౌన్, జూలై 08,(సీమ కిరణం న్యూస్): డోన్ పట్టణంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆయన ప్రజా సంక్షేమ పాలన, రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను నాయకులు స్మరించుకున్నారు. వైఎస్ ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తామని, ప్రజా సేవే తమ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం సహా నిధి పేదల వరం









డోన్ టౌన్, జూలై 08,(సీమ కిరణం న్యూస్): డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఈరోజు బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధి ( సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన మొత్తం రూ.30,00,000/- (అక్షరాలా ముఫై లక్షల రూపాయల )విలువైన చెక్కులను డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆరోగ్య చికిత్సలు, అత్యవసర వైద్య అవసరాలు, ప్రమాదాలు మరియు ఇతర సంక్షేమ కారణాల నిమిత్తం పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపశమనం కలిగించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తుం దన్న దానికి ఇది నిదర్శనమని ఎమ్మెల్యే అన్నారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం అందేలా తగిన చర్యలు తీసుకుంటామని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## వెల్దుర్తిలో ఘనంగా వైఎస్సార్ 77వ జయంతి వేడుకలు



వెల్దుర్తి, జులై 8 (సీమకిరణం న్యూస్): కర్నూలు జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 77వ జయంతి వేడుకలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుంకన్న, రామళ్లకోట కృష్ణారెడ్డి, బింగిరెడ్డి, జగన్మోహన్ రెడ్డి, పేరేముల రాధాకృష్ణారెడ్డి, కొత్తూరు వెంకటేశ్వర రెడ్డి, గట్టు ఆరిఫ్, దేవరాజు,రాజుతో పాటు పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అహోబిలంలో పొలిటికల్ హైటెన్షన్: భూమా అఖిలప్రియ వర్సెస్ గంగుల నాని

నంద్యాల జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం అహోబిలం వేదికగా రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. అహోబిలం ఆలయ తలనీలాల వ్యవహారంలో ఆరోపణలు, సవాళ్లతో స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, వైసీపీ నేత గంగుల బ్రిజేంద్రరెడ్డి అలియాస్ నాని మధ్య పొలిటికల్ వార్ పీక్స్‌కు చేరింది. తలనీలాల కాంట్రాక్ట్ వ్యవహారంలో అఖిలప్రియకు భారీగా ముడుపులు అందుతున్నాయని, ఇటీవల అవి అందకపోవడంతోనే ఆమె తలనీలాల తరలింపును అడ్డుకున్నారంటూ గంగుల నాని సంచలన ఆరోపణలు చేశారు. గంగుల నాని చేసిన అవినీతి ఆరోపణలపై అఖిలప్రియ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై చేసిన ఆరోపణలను నిరూపించాలంటూ ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. "నీ దగ్గర నిజంగానే ఆధారాలు ఉంటే అహోబిలం రా. అక్కడే తేల్చుకుందాం. తలనీలాల వ్యవహారంలో నా ప్రమేయం ఉన్నట్లు రుజువైతే నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా" అంటూ సవాల్ విసిరారు. అన్నట్లుగానే అఖిలప్రియ తన అనుచరులతో కలిసి అహోబిలం చేరుకున్నారు. ఒకవేళ గంగుల నాని చర్చకు రాకపోతే, నేరుగా ఆయన ఇంటికే వెళ్లి నిలదీస్తానని స్పష్టం చేయడంతో ఉత్కంఠ మరింత పెరిగింది. మరోవైపు ఎమ్మెల్యే విసిరిన ఛాలెంజ్‌పై గంగుల నాని కూడా వెనక్కి తగ్గలేదు. తాను చేసిన ప్రతి ఆరోపణకూ కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు.

# కర్నూలు పోలీసుల ఘనత








### రూ.1.36 కోట్ల విలువైన 679 మొబైల్ ఫోన్లు రికవరీ!

కర్నూలు క్రైమ్, జూలై 08, (సీమకిరణం న్యూస్) : మొబైల్ ఫోన్లు పోగొట్టుకుని ఆందోళనలో ఉన్న బాధితులకు కర్నూలు జిల్లా పోలీసులు అండగా నిలిచారు. కర్నూలు సైబర్ ల్యాబ్, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో రికవరీ చేసిన 679 మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం బాధితులకు అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో నిర్వహించిన "5వ విడత మొబైల్ రికవరీ మేళా" కార్యక్రమంలో ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ ఫోన్లను పంపిణీ చేశారు.

**5 విడతల్లో రూ.6.20 కోట్ల విలువైన ఫోన్లు అప్పగింత**

ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఐదో విడతలో రికవరీ చేసిన 679 మొబైల్ ఫోన్ల విలువ సుమారు రూ.1 కోటి 36 లక్షలు ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం ఐదు విడతల్లో కలిపి 3,081 మొబైల్ ఫోన్లను (మొత్తం విలువ రూ.6 కోట్ల 20 లక్షలు) రికవరీ చేసి బాధితులకు విజయవంతంగా అందజేశామని వెల్లడించారు.

**విడతల వారీగా రికవరీ వివరాలు:**




మొదటి విడత : 600 మొబైల్స్ -- రూ.1.20 కోట్లు
రెండవ విడత : 604 మొబైల్స్ -- రూ.1.30 కోట్లు
మూడవ విడత : 669 మొబైల్స్ -- రూ.1.20 కోట్లు
నాలుగవ విడత : 529 మొబైల్స్ -- రూ.1.10 కోట్లు
ఐదవ విడత : 679 మొబైల్స్ -- రూ.1.36 కోట్లు

**ఇతర రాష్ట్రాల నుండి సైతం రికవరీ**

కేరళ, మహారాష్ట్ర, ముంబై, రాజస్థాన్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి కూడా మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. కేరళ నుంచి నందికొట్కూరుకు చెందిన హిదయతుల్లా, మహారాష్ట్ర నుంచి ఆదోనికి చెందిన రామాంజనేయులు, ముంబై నుంచి దేవరగట్టుకు చెందిన హరికృష్ణ, రాజస్థాన్ నుంచి ఆదోనికి చెందిన ఎ. వెంకటేశ్వరరావు, కర్ణాటక నుంచి కర్నూలుకు చెందిన భానుల ఫోన్లను రికవరీ చేసి అప్పగించారు. పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి చేతికందించినందుకు బాధితులు ఎస్పీకి, సైబర్ ల్యాబ్ పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**ఎస్పీ గారి ముఖ్య సూచనలు:**

ఉచిత సేవ: మొబైల్ రికవరీకి ఎలాంటి రుసుము లేదా ఫీజు ఉండదు.

**ఎలా ఫిర్యాదు చేయాలి:** మొబైల్ పోగొట్టుకున్న వారు వెంటనే కర్నూలు పోలీసుల అధికారిక వెబ్‌సైట్ లింక్ **(Kurnool Police Mobile Theft)** ద్వారా లేదా కేంద్ర ప్రభుత్వ **CEIR** పోర్టల్ ద్వారా, లేదంటే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి.

**డేటా భద్రత ముఖ్యం:**

ఫోన్లలో బ్యాంకింగ్ వివరాలు, వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డ్‌లు ఉంటాయి కాబట్టి ఫోన్ హ్యాకింగ్ లేదా దుర్వినియోగం కాకుండా కొత్త సెక్యూరిటీ ఫీచర్లను వాడుకోవాలి. ఈ కార్యక్రమంలో అద్భుత ప్రతిభ కనబరిచిన సైబర్ ల్యాబ్ సిబ్బందిని, పోలీసులను ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, సీఐలు మధుసూదన్ రావు, శివశంకర్, సైబర్ ల్యాబ్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, మరియు సైబర్ ల్యాబ్ టెక్నికల్ టీం పోలీసులు పాల్గొన్నారు.





## దివ్యాంగ విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలి : డాక్టర్ శంకర్ శర్మ









కల్లూరు, జూలై 08, (సీమకిరణం న్యూస్): దివ్యాంగ విద్యార్థులు శారీరక లోపాలను అధిగమించి, మానసిక దృఢత్వంతో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ పిలుపునిచ్చారు. హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వికలాంగుల వసతి గృహంలో ఉన్న విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు, పుస్తకాలు, రైటింగ్ ప్యాడ్‌లు, మరియు వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ శంకర్ శర్మతో పాటు వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) ఫాతిమా పాల్గొన్నారు.

**మానవ సేవయే మాధవ సేవ**

ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ "మానవ సేవయే మాధవ సేవ" అనే భావనతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వసతి గృహంలోని విద్యార్థులు అంగవైకల్యంతో బాధపడుతున్నప్పటికీ, వారిలో ఉన్న మానసిక ధైర్యం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. గతంలో ఇక్కడ చదువుకున్న ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని, ప్రస్తుత విద్యార్థులు కూడా వారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. చదువుతో పాటు పారాస్పోర్ట్స్ (క్రీడల్లో) కూడా రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

**ఆరోగ్య పరంగా అండగా ఉంటా:**

"వసతి గృహంలో ఉండే దివ్యాంగ విద్యార్థులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా నా వంతు సహాయ సహకారాలు అందించడానికి నేను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను" అని డాక్టర్ శంకర్ శర్మ భరోసా ఇచ్చారు. ప్రస్తుత రోజుల్లో యువత సెల్‌ఫోన్లకు బానిసలై తమ అమూల్యమైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై, చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఈ సందర్భంగా సూచించారు.

**ఈ సేవా కార్యక్రమంలో**

ఫాతిమా (వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ), ఆర్. నాగేశ్వర రెడ్డి (వసతి గృహ వార్డెన్), రంజిత్ (హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు),రామాంజనేయులు (దివ్యాంగుల అసోసియేషన్ అధ్యక్షుడు), మరియు ట్రస్ట్ ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌కు గర్వకారణం.. నర్సిరెడ్డికి పదోన్నతి



### ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ నర్సిరెడ్డికి ఘనంగా సత్కారం



వెల్దుర్తి, జులై 8, (సీమకిరణం న్యూస్ ) : వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో గత నాలుగు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందిన హెడ్ కానిస్టేబుల్ జి. నర్సిరెడ్డికి అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏ ఎస్ ఐ)గా పదోన్నతి లభించింది. పదోన్నతిలో భాగంగా ఆయనను నంద్యాల జిల్లాకు బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెల్దుర్తి ఎమ్మార్పీఎస్ నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని జి. నర్సిరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు అక్కడికి వచ్చిన ప్రజలకు స్వీట్లు పంపిణీ చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మార్పీఎస్ నాయకులు, జి. నర్సిరెడ్డి విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో పనిచేయడంతో పాటు ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగడం వల్లే ఈ పదోన్నతి దక్కిందని కొనియాడారు. పోలీసు శాఖలో ఆయన అందించిన సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. నూతన బాధ్యతల్లోనూ ఇదే సేవా దృక్పథంతో విధులు నిర్వర్తిస్తూ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సహోద్యోగులు కూడా నర్సిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, నంద్యాల జిల్లాలో ఏఎస్ఐగా బాధ్యతలు విజయవంతంగా నిర్వహించాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నాయకంటి గిడ్డయ్య, నాయకంటి చిన్నహరి, పోస్టు రాజేష్, ప్రసాద్, శ్రీధర్, హుస్సేన్, ఎర్రోడు తదితరులు పాల్గొని జి. నర్సిరెడ్డిని అభినందించారు.

